ప్రతిభ చూపిన విద్యార్థులు

హఫీజ్‌పేట్: ఇటీవల సెమీ ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో చందానగర్‌లోని విద్యావాణి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొదటి తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ట్రెజమా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్‌లు విద్యార్థులకు జ్ఞాపికలను, ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఒలంపియాడ్ ఫౌండేషన్ కన్వీనర్ రామచంద్రారెడ్డి, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో మహేంద్ర అశ్విత అపార్ట్‌మెంట్స్‌లో అశ్విత వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, అపార్ట్‌మెంట్స్ వాసులు పాపారావు, మాధవరావు, ఎంఎస్ మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన స్థానిక నేతలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఘనీ ఆదివారం మర్యాద పూర్వంగా కలిశారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్, షేక్ అబ్దుల్ వాసీం ఉన్నారు.

ఫోన్‌కు వచ్చే లింక్‌లు నొక్కొద్దు..

డబ్బులు పోగొట్టుకోవద్దు..!

- మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు.. మీ కరెంటు మీటర్ కట్ చేస్తున్నాం.. బిల్లు చెల్లించండి.. అంటూ ఇటీవల ప్రశాసన్ నగర్‌లో నివసిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారికి ఫోన్ కాల్ వచ్చింది. తాను బిల్లు చెల్లించానని ఆయన చెబుతున్నా వినకుండా ఆన్‌లైన్‌లో ఈ లింక్ ఓపెన్ చేసి పే చేయండి అంటూ భయపెట్టాడు. ఆయన లింక్ ఓపెన్ చేసిన నిమిషం వ్యవధిలోనే మూడు దఫాలుగా రూ. 70 వేలు ఆయన ఖాతా నుంచి విత్ డ్రా అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మీకు ఫెడెక్స్ కొరియర్‌లో వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. మిమ్మల్ని అరెస్టు చేయడానికి వస్తున్నామని బంజారాహిల్స్‌లో నివసిస్తున్న ఓ వైద్యురాలికి ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ ఫోన్ వచ్చింది. మేము ఇచ్చిన ఖాతాలోకి డబ్బు పంపకపోతే మిమ్మల్ని వెంటనే అరెస్టు చేయాల్సి వస్తుందంటూ ఆమెను బెదిరించారు. వెంటనే ఆమె లింక్ నొక్కి రూ. లక్ష సమర్పించుకున్నారు.

బంజారాహిల్స్: సైబర్ చీటర్స్ చేతిలో మోసపోతున్న ఇలాంటి ఘటనలు ప్రతి పోలీస్‌స్టేషన్ లోనూ రోజుకు 5 నుంచి 10 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక్క బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఈ ఏడాదిలో ఇప్పటివరకు సైబర్ మోసాలపై 80 వరకు ఫిర్యాదులు అందుకున్నారు. దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ సైబర్ మోసాలపై రోజూ ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. లింక్‌లు నొక్కవద్దంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కలిగిస్తున్నా బాధితుల సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కోసం గత కొంతకాలంగా ఫిలింనగర్ పోలీసులు ఆస్పత్రులు, బ్యాంక్‌లు, హోటళ్లు, మాల్స్ ఇతర రద్దీ ప్రాంతాల్లో మోసపోవద్దు అంటూ హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.


సైబర్ మోసాలపై అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఫిలింనగర్ పోలీసులు

- వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజగుట్ట, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ మోసాలపై తరచూ సిబ్బందితో పాటు అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.
- మోసపూరితమైన ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు.
- రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఆధారంగా చేసుకుని అమాయక జనానికి అధిక వడ్డీ ఆశ చూపించి పెట్టుబడి కంటే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పి మోసం చేస్తున్న ఘటనలు కూడా ఇటీవల పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.
- గుర్తుతెలియని నెంబర్ నుంచి వచ్చే లింక్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని, మన ప్రమేయం లేకుండానే మొబైల్స్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని పోలీసులు పేర్కొంటున్నారు.
- ఎవరైనా ఇలాంటి మోసాలకు పడితే బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు పేర్కొంటున్నారు.
- సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని కూడా పేర్కొంటున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను కూడా ఇటీవల ఓ విశ్రాంత అధికారి గ్యాస్ పొయ్యి రిపేర్ కోసం వెతికి భారీగా డబ్బులు పోగొట్టుకున్న విషయాన్ని కూడా పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- కస్టమర్ కేర్ నెంబర్లను గూగుల్‌లో వెతకవద్దని సూచిస్తున్నారు. అపరిచితుడి నెంబర్ నుంచి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ ద్వారా వచ్చే వీడియోకాల్స్‌కు స్పందించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు.
- ప్రజలు లింక్‌ల జోలికి పోకపోతే ఖాతా నుంచి పైసా కూడా బయటకు పోదని, ఈ ఒక్క విషయాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించుకుని తమ బంధుమిత్రులు, చుట్టుపక్కల వారికి కూడా ఫంక్షన్లు, శుభకార్యాల్లో చర్చించుకుంటే ఎంతోమందిని కాపాడినవారమవుతామని పోలీసులు అంటున్నారు.

సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన

మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయండి

రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీల ద్వారా చైతన్యం

సైబర్ మోసం..? డయల్ 1930:



ఎవరైనా సైబర్ మోసానికి గురైతే క్షణాల్లోనే 1930కు ఫోన్ చేయాలి. మీరు ఎలా మోసపోయారో వివరిస్తున్న సమయంలోనే అక్కడి సిబ్బంది వెంటవెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ మరుక్షణంలోనే డబ్బులు పోగొట్టుకున్న బాధితుల బ్యాంక్ అకౌంట్లు, చీటింగ్ చేసిన సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్‌ను, సైబర్ మోసగాడి బ్యాంక్ అకౌంట్ నుంచి ఇతరులకు డబ్బులు మళ్లించిన వారి ఖాతాలను కూడా స్తంభింపజేశారు. సైబర్ మోసం జరిగిన మరుక్షణంలోనే ఇలా 1930కు ఫోన్ చేయడం వల్ల బాధితుడి నుంచి మిగతా డబ్బు విత్‌డ్రా కాకుండా సైబర్ మోసగాడి ఖాతా నుంచి డబ్బు ఇతర ఖాతాల్లోకి మళ్లకుండా చేయవచ్చు. ఈ ఒక్క విషయంలో ప్రజలు బాగా అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసాల పట్ల పలు కార్యక్రమాల ద్వారా మేము అవగాహన కల్పిస్తున్నాం. లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు. అపరిచితుల కాల్స్‌కు స్పందించవద్దు. ఫెడెక్స్ పార్శిల్, కొరియర్ అంటూ ఇటీవల డ్రగ్స్ పేరిట ముంబాయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ చాలామందికి ఫోన్లు వస్తున్నాయి. ఏ ఒక్కరూ భయపడవద్దు. అలా ఫోన్ వచ్చిన మరుక్షణమే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. అలాగే లింక్స్ ఓపెన్ చేయమని చెబుతారు. స్పందించవద్దు. బ్యాంక్ ఖాతాలు ఇస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయవద్దు. ఇలాంటి చిన్న చిన్న విషయాల్లో జాగ్రత్తగా ఉండి పోలీసుల రక్షణ కోరాలి.

– రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్

నేడు ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వివివిఎస్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు షిర్డీ సాయిబాబాకు కాగడ హారతి కార్యక్రమంలో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన చేస్తారు. అనంతరం గణపతి, దత్తాత్రేయ స్వామి, షిర్డీసాయిబాబాకు పంచామృతాభిషేకం, మంగళస్నానాలు వంటి కార్యక్రమాలు చేస్తారు. అనంతరం రాత్రి 9 గంటలకు శేజ్ హారతితో వార్షికోత్సవాలను ముగిస్తారు.

వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు


ప్రభుత్వ పాఠశాలకు నీళ్ల ట్యాంకులు అందజేస్తున్న దృశ్యం

రాయదుర్గం: పలు సేవా కార్యక్రమాలను మణికొండలోని వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాసవి ఆదేశాలపై 'డాన్ టు డస్క్ సేవా' కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గచ్చిబౌలిడివిజన్‌లోని ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాలకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ళ ట్యాంకు, 20 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కానిస్టేబుళ్ళకు మాస్కులు, టవల్స్, స్ట్రీట్ వెండర్‌కి గొడుగులు, ఆరు సభ్యుల చేత ఆర్గాన్ డోనర్ చేయించడం, వాసవి అమ్మవారి ఆలయంలో సేవా కార్యక్రమాలను వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్‌లోని ఈసీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవిక్లబ్ కపుల్స్ అధ్యక్షులు వంటిపీటి వంశీకృష్ణ, కార్యదర్శి తల్లాడయశ్వంత్ పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు


న్యూ హఫీజ్‌పేట్‌లోని ఈద్గాను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

హఫీజ్‌పేట్: బక్రీద్ పండును పురస్కరించుకొని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేయవలసిన భద్రతపై మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ దుర్గ ప్రసాద్‌లు పరిశీలించారు.

మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలి


ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి వినతిపత్రం ఇస్తున్న గోకుల్ ప్లాట్స్ సాయిహిల్స్ కాలనీ వాసులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలోని సాయిహిల్స్ కాలనీలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గుట్కాలు, గంజాయి వంటివి విక్రయిస్తున్నారని వాటిని అరికట్టాలని ఆదివారం కాలనీ వాసులు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. గోకుల్ ప్లాట్స్‌లో సుమారు 300 కుటుంబాలు నివాసముంటున్నారని కాలనీకి ఆనుకొని ఉన్న హౌసింగ్ బోర్డు స్థలంలో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నారన్నారు. ఆ కొట్టులో సిగరెట్లు, మత్తు పదార్థాలు, గుట్కాలు, గంజాయి వంటివి విక్రయిస్తున్నారన్నారు. దీన్నే అదునుగా చూసుకొని వివిధ ప్రాంతాల నుంచి యువకులు వచ్చి మత్తుపదార్థాలతో పాటు గంజాయి సేవిస్తున్నారన్నారు. ఆ ప్రాంత మహిళలు కొట్టు ముందు వెళ్తుంటే వారిపట్ల యువకులు అసభ్యంగా ప్రవరిస్తున్నారన్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు కొట్టు నిర్వహకులను అడడగా తిరగబడి తమను దూషిస్తున్నారన్నాని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు అమ్ముతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని, మత్తు పదార్థాలు, గంజాయి వంటి అమ్మకాలు చేస్తున్న కొట్టు నిర్వహికులతో పాటు ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే


వృద్ధాశ్రమంలో అల్పహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

మియాపూర్: మియాపూర్‌లోని గ్రేస్ అనాథ, వృద్ధాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో పితృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి హాజరై వృద్ధులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధర్మసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు రాష్ట్రంలో మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోయారు.

వ్యర్థాల కోసమే కవర్ల పంపిణీ

కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: పంపిణీ చేసిన కవర్‌లలోనే వ్యర్థాలు వేయాలని వాటిని జీహెచ్ఎంసీ సిబ్బంది సేకరిస్తారని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ చెప్పారు. బక్రీద్ సందర్భంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మజీద్‌లతోపాటు ముస్లింలకు ఆదివారం ఆయన ప్లాస్టిక్ కవర్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మాంసాహార వ్యర్థాలను చెత్తకుండీల వద్ద పడివేస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.


కవర్లను అందజేస్తున్న కార్పొరేటర్

సమస్యల పరిష్కారానికి కృషి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా నియామకమైన అభివృద్ధి, సంక్షేమ సంఘ సభ్యుల శిలాఫలకాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి స్థానికులకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ సంఘ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని , సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, భూపాల్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, పట్నాయక్, శ్రీనివాస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


శేరిలింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు సమావేశమైన దృశ్యం

అ'పూర్వ' సమ్మేళనం

శేరిలింగంపల్లి: పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ విద్యార్థులంతా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు మళ్ళీ ఒకసారి పరిచయం చేసుకుంటూ, పాత జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ మళ్ళీ విద్యార్థులుగా మారిపోయారు. కాగా ఒకరినొకరు పలకరించుకుంటూ కుటుంబ వివరాలు అడుగుతూ ఆనందంగా గడిపారు. ఈ సమావేశానికి తాము చదివే సమయంలో ఉన్న టీచర్ మల్లేషంను పిలిచి ఘనంగా సత్కరించారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్బర్, శంకర్, మల్లేష్, రవితేజ, భూపాల్ రెడ్డి, జీవన్, మల్లకార్జున్, ప్రకాశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో చేరిన బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్

రాయదుర్గం: గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్ చేరింది. అపార్ట్‌మెంట్‌లో 234 కిలోవాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సోలార్‌ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సోలార్‌పవర్ ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేషన్ సోలార్ కమిటీ సభ్యుడు పివిరెడ్డి పాల్గొన్నారు.


సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

నేటి నుంచి దైవ సన్నిధానం వార్షిక బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: విశాఖ శ్రీశారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం ఉదయం 8 గంటలకు విశేష అలంకారం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, హారతితో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు. 18న ఉదయం 8 గంటలకు శ్రీస్మార్తాగమ, శ్రీవైఖానస ఆగమముల ప్రకారం విశేష అలంకారం, సాయంత్రం 5 గంటలకు శ్రీభ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి వారి శాంతి కల్యాణం హారతి, శేష వాహనం, రాత్రి 7 గంటలకు అమృత గోపాల్‌చే కర్ణాటక సంగీత కచేరీ ఉంటాయన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, నిత్య హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి శాంతి కల్యాణం, గజ వాహనం, హారతి, రాత్రి 7 గంటలకు ఐశ్వర్యవల్లి కాకులపాటి శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఉంటాయని తెలిపారు. 20న ఉదయం 7 గంటలకు శ్రీశ్రీ భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అలంకారం, రాత్రి 7 గంటలకు గరుడసేవ, నిత్యపూజ, మోమం, ప్రసన్నలక్ష్మీ బృందంచే త్యాగరాజ సంకీర్తనల కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 21న ఉదయం చూర్ణోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, కైంకర్య దాతలకు స్వామి వారి శేష వస్త్ర ప్రసాదం, జ్యోతిపూర్ణిమచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8 గంటలకు ధ్వజారోహణం ఉంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర మాజీ శాసనమండలి నేత వెన్నవరం భూపాల్ రెడ్డి సూచించారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో ధ్రువ విజయ హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ 5వ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యానికి సూచించారు. కార్పొరేటర్‌లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌టీయూను గెలిపించండి...

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని జేకే ఫెన్నార్ పరిశ్రమలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పరిశ్రమ జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. మెరుగైన వేతన ఒప్పందం చేయడంతోపాటు, కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పారు.

మ్యాన్‌హోళ్లను పట్టించుకోండి



మియాపూర్: డ్రైనేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మూనాళ్లకే ధ్వంసమై పోతున్నాయి. మియాపూర్‌లోని ఎంఎల్ఏ క్యాంపు ఆఫీస్ రోడ్డులో మ్యాన్‌హోల్ కుంగి ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. గత 15 రోజుల క్రితం మ్యాన్‌హోళ్ల మరమ్మత్తులు చేయాలని సాక్షి దిన పత్రికలో శీర్షిక ప్రచురితమైంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మత్తులు చేశారు. మ్యాన్‌హోళ్ల నిర్మాణం మరమ్మతులలో నాణ్యత లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఒక అడుగు లోతు కుంగిపోయంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లను నాణ్యత ప్రమాణాలతో మరమ్మత్తులు చేయాలని కోరారు.

ఉపాధి కల్పన మంచి పరిణామం

పటాన్‌చెరు టౌన్: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా సొంతంగా ఉపాధి పొందుతూ నలుగురికి ఉద్యోగాలు కల్పించే దిశగా సాగడం మంచి పరిణామం అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముత్తంగి పంచాయతీ పరిధిలో సిరి బ్యాంకెట్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత వ్యాపారంగంలో రాణిస్తూ ఉపాధికల్పనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, అశోక్, సంజీవ్, నారాయణరెడ్డి, ప్రవీణ్, రాజు, బాలరాజు, అనిల్, కృష్ణ, మహిపాల్ రెడ్డి, నర్సింహ, వీరన్న, వెంకటేశ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములవ్వండి

మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి


చెరువును శుభ్రం చేయడానికి సిద్ధమైన గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సేవ్ లేక్, సేవ్ వాటర్ ఉద్యమంలో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెలికుంట చెరువు పరిసర ప్రాంతంలోని చెత్తను తెల్లాపూర్ నైబర్‌హుడ్ గ్రీన్ ఆర్మీ సభ్యులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో పాటు సుమారు 50మంది ఐటీ నిపుణులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యంలో ప్రతిఆదివారం చెరువు పరిసర ప్రాంతంలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టడం హర్షణీయం అని ప్రశంసించారు. దీనిలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వంతుగా చెత్తను తొలగించారని చెప్పారు. అదేవిధంగా తాము కూడా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రభుత్వ భూమిని దున్నడంపై ఫిర్యాదు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామంలోని 181సర్వే నంబర్‌గల ప్రభుత్వ భూమిలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దుక్కి దున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తూ దుక్కి దున్నడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.